# మాటవరస

భమిడిపాటి కామేశ్వరరావు గారు

## చుట్టా, బీడీ, సిగరెట్

చుట్టా, బీడీ, సిగరెట్లు త్రిమూర్తులని చెప్పచ్చు. వీటికి జన్మస్థానం ఆయొక్క ఆదివిరాట్స్వరూపమైన పొగాకు. ఈరూపాల్లోనే గాక, పొగాకు, అనేకమైన ఇతర ఆకారాలల్లో, భూమిమీద, కర్మవశంచేత, అవతారాలు ఎత్తి ఉంది; తను నాశనం అయిపోయి ప్రపంచాన్ని నడిపిస్తోంది. పొగాకు ఇతరులకోసం తగులడిపోతోంది. అదే, చుట్టా, బీడీ, సిగరెట్, స్వరూపం! పొగాకు ఇతరుల నిమిత్తం పొడుమైపోతోంది. అదే ముక్కుపొడుం స్వరూపం! (అరవంలో మూకుపొడీ స్వరూపం) పొగాకు ఇతరులకై, ఎండి, తడిసి, అడ్డమైన నూనెసరుకుతోటీ కలిసి ముక్కముక్కలు అవుతోంది. అదే మసాలా స్వరూపం! పొగాకు ఇతరులకొరకై సున్నమై నలిగిపోతోంది. అదే పట్టీ స్వరూపం! పొగాకు ఇతరులకి, శిబిచక్రవర్తికి మల్లే నిజశరీరం కండలుచెండి ఇస్తోంది. కొందరు ఉద్యోగులు ఏకచేరీలో పనిమధ్యలో ఉండి, రొండిని జాగ్రత్తచేసి పట్టుగెల్లిన పొగాకుముక్క ఆపళంగానే అమాంతంగా కొరుక్కు తింటారు, పటికబెల్లం తిన్నట్టు. దాన్ని 'కచేరీతాంబూలం' అంటారు—అదే కచేరీతాంబూల స్వరూపం! ఇప్పుడు మనం పొగాకు యొక్క ధూమలక్షణం వెల్లడిచేసే త్రిమూర్తులనీ గురించిమాత్రమే కొంచెం ఆలోచిద్దాం! (ప్రపంచంలో ఉండే ప్రతీమారుమూలలోనూ పొగాకు మతం వ్యాపించే సెయ్యడానికి ఎక్కువ అవకాశం ఉంది గనక!)

చుట్ట అనే వస్తువు పొగాకుకి తాదాత్మ్య స్వరూపం—అనగా అభేదస్వరూపం. కాని కొందరిమతం వేరు. కొన్ని చుట్టల్లో పొగాకు కాడలు మాత్రమే ఉంటాయనిన్నీ, మరికొన్నింటిల్లో పారేసిన చుట్టపీకలకళేబరాలుంటాయనిన్నీ వారి అభిప్రాయం. అయినప్పటికీ చుట్టయొక్క పొత్తి పొరాలు ప్రకృతి పురుషులనిన్నీ, వాటిమూలంగా పరమాత్మ కణకణలాడుతూ వ్యక్తమౌతాడనిన్నీ అందరూ ఒప్పుకుంటారు. బీడీ లోపలిభాగం పొగాకు తుక్కు అయినప్పటికీ, బాహ్యం మాత్రం, వేరేపత్రం—తునికీ ఆకు, కొండొకచో జిల్లేడు. సిగరెట్టు లోపలిభాగం, అనేక ఓషధుల సాహాయ్యంచేత పొగాకుయొక్క కపటు పోగొట్టుగుని నవ్యసౌరభం ఆర్జించి, కాకితపు దాంపత్యం కలిగి ఉన్న నవీనావతారం సిగరెట్ స్వరూపం కాక, తక్కిన రెండూ హిందూదేశానికి చెందినవే అని ఒప్పుగోవచ్చు. బీడీ మహమ్మదీయులది,ఆపత్రంకూడా వారిదేశంలోనే దొరుకుతుంది. ఆమాట ఋజువుచేసుగోవచ్చు. పొగాకు అమెరికాలో, ఒక తెల్ల ఆసామీ ప్రయాణంచేస్తూ కనిపెట్టినట్టు చెబుతారు గాని, వొట్టిమాట! అది ఈదేశాందే అని చెప్పడానికి అనేక నిదర్శనా లున్నాయి. సోమపానం, ధూమపానం గురించి సెలవిచ్చినట్టే ధూమపత్రం గురించి కుడా అనేకమంది ఋషులు స్పష్టంగా, తెగేసి, సెలవిచ్చారు. వెనక బాగా చుట్ట కాల్చడంచేత ధూమ బిరుదు తెచ్చుగున్న ఒకాయన సంతతి వాడేట ధౌమ్యడనే అబ్బాయి! ఇంకా ఇతర నిదర్శనాలు కావలిస్తే, 'రిసర్చి' చేస్తే, మనకి ఏవిధంగా సాక్ష్యాలుకావాలంటే ఆవిధంగా, రాగిరేకులు, తాళపత్రగ్రంథాలు, నాణాలు వగైరాలు దొరుకుతాయి. మనకి ప్రతికూలంగా ఉండేవి కూడా దొరికితే దొరకవచ్చుగాని, అది రిసర్చిగనక వాటిని కప్పిపుచ్చడంలో ప్రత్యవాయువు లేదు. అందుకని చుట్టగురించి మనం స్వవిషయంలా మాట్లాడుకోవచ్చు. చుట్ట అంటించడానికి పూర్వం చివరకొన పంటితో కొరుకుతారు—చివర మెలెట్టి ఉండడంవల్ల ఓ చివరనించి ఓచివరికి గాలి లాగటానికి రాధారీ లేదేమో అనే భయం చొప్పున. బీడీవెలిగించడానికి పూర్వం, దాన్ని తల్లకిందులుగా పెదవులలోపలికి పెట్టుగుని, పెదవులు బిగించి, వెలిగించబోయే వేపుకి ఆపరి పెడతారు—కొంత ఆవిరితడి దానికి తగిలి అది మెచ్చు

తగ్గులు లేకుండా గుండ్రంగా కాలుకుంటూరావడానికీ నిన్నీ, లోపలవేంచేసి ఉన్న ఘువంటి పొగాకు రేణువులు పీల్చే చివర నక్కి ఉండి, బీడీ వెలిగించి ఆదుర్దాగా పీల్చగానే, ఆ మొదటి పీలుపులోనే గొంతుకలో ప్రవేశిస్తాయేమో, వాటికి ముందస్తిగా ఉద్వాసన చెప్పక పోతే ఎల్లామరీ, అనే అభిప్రాయంతోటీనీ! సిగరెట్టు ముట్టించడానికి పూర్వం, దాన్ని పుస్తకంలాంటి బల్లపరుపు ప్రదేశం మీద ఉంచి, అరచేత్తో నొక్కి, ఇటూ అటూ రెండుమూడుసార్లు అప్పడాల కర్రని మల్లే, దొల్లించి, తీసి, పుస్తకాన్నెట్టి, మెల్లిగా తాటిస్తారు– అది లోగడ కర్రబారి ఉండినట్టాయినా పొగసజావుగా రాకపోతుందేమో అని భయమేసి. ఇలాగ్గా ఈస్వరూపాలు జీవం దాలుస్తాయి. ఈ మూడింటి లోకీ బీడీ అదొక మోస్తరు జంతువు. ఏమాత్రం వ్యవధానం లేక పెద్దపనిలో ఉండి ఒక్కదమ్ము, లిప్తలోలాగి, పోడానికి టైము సరిపోయే పెద్ద ఉద్యోగస్తులు, కానీకి చాలా వస్తాయిగదా ఎప్పుడు పారేసినా పారెయ్యొచ్చు, మనస్సుకేమీ బాధలేకుంఢా అనుకునే కొద్దివాళ్ళూ, ఎవళ్లేనా చెయిచాస్తే, క్షోభలేకుండా వాడికి ఓటివ్వొచ్చునా–అనే వాళ్ళూ వగైరాలు బీడీ సేవిస్తారు. అయితే, ఓ కాని బీడీలకి ఓ అగ్గిపెట్టేనా అధఃపుంకావాలి గనకనున్నూ, ఎక్కడేనా ఆజంతువు తాలూకు ఒక నెరుసు పడిందంటే ఆ చుట్టు పక్క ప్రాంతం అంతా దగ్ధపటలం అవుతందనే భయంచేతనున్నూ దాని ప్రచారం కొన్ని కొన్ని చోట్లే ఉంటుంది.

ఇక చుట్టాసిగరెట్లని రెండింటని మాత్రమే పోల్చాలంటే, చుట్టమోటు—సిగరెట్టు నీటు, చుట్ట నల్లజాతి, సిగరెట్టు తెల్లజాతి. చుట్ట అంతా పొగాకే గనక, అది పత్రగ్రంథం, కాబట్టి సనాతనం. సిగరెట్టు కాగితపు వ్యాపారం, కాబట్టి ఆధునికం. ఇంగ్లీషుచదువుకీ సిగరెట్టుకీ సంబంధం ఉందని ఋజువు చూపించడానికే సిగరెట్టు కాగితంతో చేశారని కొందరి నమ్మకం. చుట్ట వాసన చుట్ట కంపు, సిగరెట్టు వాసన సిగరెట్టు పరిమళం. ఆ పరిమళం గ్రహించ లేనివాడు తనకి మళ్లీమహా ఇంగ్లీషువచ్చునని ఏమొహం పెట్టుగుని చెప్పుకోడం అని కొందరి ఊహ. ఏమంటే! ఆ సిగరెట్టు వాసన కేవలం ఆ ఇంగ్లీషు వాసనేనండీ!

ఈ రెండు స్వరూపాలూ కూడా వాయురూపేణామాయమై, జగత్తంతా చివరికి మాయగదా అని చెప్పక చెబుతూంటాయి. ఇవి వెలిగి వెలిగి బూడిద కూడా ఆవుతాయి ఆవిషయంలో చుట్ట బూడిదే పేరు మోసింది. దాన్ని కొందరు చచ్చుపిలుపులు పిలవక "చుట్ట విభూతి" అంటారు. కొందరు రహస్యంగా చుట్ట కాల్చేవాళ్లు అల్లాంటి విభూతి జాగ్రత్తగా కాళీ అగ్గిపెట్టెల్లో కిందరాలకుండా విదిపి, అది కురుపులకి మందుగా వాడుతున్నారట, మతాబా బూడిద వాడినట్టు! సిగరెట్టు విభూతికి అంత తెల్లదనం లేదు, పేరూ లేదు. అందుకనే అది జాగ్రత్త చెయ్యరు. కొందరు, తక్కిన వేళ్లతో సిగరెట్టుపట్టుగుని చూపుడు వేలు ఒక్కటే మాత్రం అభినయించి, ఆవిభూతి ఊడకొడతారు. మరి కొందరు, దాన్ని తర్జనీ మధ్యమాలతో నొక్కిఉంచి, ఒక్కచిటికెలో ఆవిభూతి విసర్జిస్తారు. క్రియకి, గాలి గాలిలో కలిసి పోతుందర్రా అని ఈ రెండూకూడా సెలవిచ్చినా, వీటిల్లోనూ మళ్లీ కాస్తంత తేడా ఉంది. సిగరెట్టు మట్టుకి అంతా ఆఖరికి శూన్యమే అంటుంది. చుట్ట అల్లా అనదు. చుట్ట కాల్చేవాళ్లు ఉమ్ముతువేస్తూంటారు. (ఉమ్ములవిషయంలో వీళ్లని మించేవాళ్లు మరోళ్లున్నారు, మసాలాకిల్లీలవాళ్లు!) ఆ ఉమ్ముల అభిప్రాయం ఏమంటే, చివరికి జగత్తంతా గాలిలో కలిసిపోదు, ఉంటే జలప్రళయం ఉండచ్చునీమీ! అని ఉంటే ఉండడం ఎంచేతంటే, కొందరు కొందరు చుట్టేశ్వరులు ఆఉమ్మిమింగేస్తారు. చుట్టలో పొగాకు చుట్టుగుని ఉండడం వల్ల దాల్లోనే ఎక్కువ తిరగడం ఉంది. సిగరెట్టులో వక్రత లేదుగాని, చీలిపోడం ఉంది. చుట్టలో ఉండే చేదు, రింగు, గీర వగైరాలు సిగరెట్టులో మృగ్యం. ఆరిందా జనం మధ్య ఉన్నప్పుడు సిగరెట్టే పీల్చాలి అనిన్నీ, తప్పని సరియై ఇతర స్వరూపాలు దొరకని స్థలంలో మాత్రం బీడీ ఊదుకోవచ్చునిన్నీ, కేవలం బాహ్యానికి వెళ్లి కాల్చడానికే చుట్టపుట్టిందనిన్నీ సిగరెట్ పక్షపాతులైన స్నేహితులు వాదిస్తారు. కాని, ఒంట

రిగా ఉన్నవాడికి చుట్టే చుట్టం. ఎంచేతంటే, ఒక్కొక్కడు, కుర్చీలో కూర్చుని, చుట్టకాలుస్తూ, పొగకేసి చూస్తూ, గంటలకి గంటలు గడుపుతూ, పర్యవసానం శూన్యం అయినా దీక్షగా ఏదో ఆలోచిస్తూన్నట్టు గంభీరంగా ఉండగలడు. సిగరెట్టువాడు అలా ఉండజాలడు. చుట్టవాడు, తను ఏదోమూల కూర్చుని ఉన్నా, ప్రపంచం జరగడం విషయంలో తన ఖంజాయింపుకుడా కొన్నిపాళ్లు ఉన్నట్టు కనిపిస్తాడు. కాని, కిల్లీ నమిలే టైములోనే చుట్టకాల్చడానికి వీల్లేకపోడం చుట్టయొక్క దౌర్భాగ్యం. ఆ వాటం సిగరెట్టుది. అందుకనే, భోజనమై, తాంబూలం వేసుగుని, అద్దం ఎదట "నెక్ టై" ముడేసుగుంటూ, పెదవి చివర సిగరెట్టు ఊగిసలాడుతూండగా, అప్పుడే మాటలు చెబుతూ, నాగరికత కాపాడుతూన్న ఉద్యోగులు తొమ్మిదిన్నరకి ఇళ్లల్లో దొరుకుతారు. చుట్టకాల్చడానికి దాన్ని పళ్లతో డబాయించి పట్టుగోవాలి. అందుకని; అవతల చివర అగ్ని ఇవతల చివర (లాలా) జలం. సిగరెట్టుని పళ్లతో నొక్కినవాడు వొట్టి అభాంద్రాప్తీనుగు. వాడు, అది ఎంత కోమలం అయినదో గ్రహించనివాడు; వాడి పళ్లు ఊడకొట్టినా పాపంలేదన్నాడు. ఒక సిగరెట్టిస్టు! అంచేత, దాన్ని పెదవులతో పట్టాలి. ఆ మాటకొస్తే కొందరు ప్రజ్ఞావంతులు పెదవి చివరతో కుడా సిగరెట్టుని నిలబెడతారు, మీసంమీద నిమ్మకాయి నిలబెట్టినట్టు. అందుమూలాన్ని, సిగరెట్టు ఇవతలకొస తడిగా ఉండదు. ఆ కారణంవల్ల, సిగరెట్టులోని అద్వితీయ విశేషం ఏమిటంటే, అది మధ్యరంగంలో తీసి, ద్వితీయుడికి ఇచ్చి, వాడిప్రాణం రక్షించచ్చు, అట్లే ఎంగిలి కలియకుండా! ఈ అవాంతరం తప్పిపోయేటందుకుగాను, కొందరు మిత్రులు ముందే సిగరెట్టుని సమద్విఖండనచేసి, చెరోసగం మొదట్లోనే పుచ్చుగుంటున్నారు. ఇది అరుదు. చుట్ట జంతువుకి ఇల్లాంటి ప్రజ్ఞ లేదు. కాని అందులో విశేషం మరోటి ఉంది. కాల్చే ఆసామీ రయే దాన్ని తల్లకిందులుచేసి పెదవులతో పట్టుగోవచ్చు. ఇది కొన్ని కొన్ని రకాల సోదరసోదరీమణులలో అభ్యాసం. చుట్టపొగముక్కులోంచి తెప్పించడం అంత సులువుకాదు; అందులో పాటి ఆకు మరీ శ్రమ. ముక్కులోంచి పొగలొస్తాయనే కొందరు సిగరెట్టు కాల్చడం. చుట్టకాలుస్తూ మాట్లాడితే, తథదధాలు వగైరాలు పలకవు, వినేవాడికి చిరాకు. సిగరెట్టుకాలుస్తూన్నప్పుడు, ఓష్ఠ్యంతప్ప, కడమా అక్షరాలన్నీ, మాతి ఏవంకరగానో పెట్టి పలకచ్చు, పళ్లకి పనిలేదుగనక! చుట్టలో మరో చిక్కుంది. ఎవరో అస్తమానం ఇతర పనిమానుకుని పీలుస్తూంటేగాని ఆరిపోతుంది వెధవ ఆరిపోడం ఇదీను! అందులో చుట్ట ఆరిపోడం ఉందే, అది గొప్ప ప్రాలుబ్ధాల్లో ఒకటి, అందుకనే కొందరు చుట్టకాలుస్తూండగానే ఏమరుపాటుగా నిద్రపోయినా, ఏమీ ప్రమాదంలేదు. అదిపట్టు తప్పి పడిపోయేవేళకి ఆరే ఉంటుంది. కాని, సిగరెట్టు ఎక్కువ బాధ్యతవహించిన ప్రాణి. సిగరెట్టుని అంటించి ఒదిలిపెడితేసరి, దానిపని అది క్రమేపీ చేసుగుంటూ పోతుంది, వెనకాల కొందరు లాగేవాళ్లు ఉన్నాసరే, మానినాసరే. అనగా, దానికి చూపిస్తే అందుకు పోగల తెలివి ఉంది. సిగరెట్టుకి పునర్జన్మలేదు. చుట్ట చాలా పాపం చేసుగున్న ఘటం గావును, దానికి పునర్జన్మలు ఉన్నాయి. అనగా, ఎవడేనా సోదరుడు కాల్చేకాల్చేచుట్ట ఆరిపి, తలపాగాలోనో, గోడమూలో పెట్టి కాస్సేపటికి మళ్లీ ముట్టిస్తూంటాడు. అది వాడికి బాగుండో, తప్పనిసరోగాని కడం వాళ్లు వస్తారు. మంచిచుట్ట వాసనే స్తేనే డొక్కు సేవాళ్లు, చుట్టయొక్క జన్మాంతరవాసన తోటి ఘూర్ణిల్లుతారు. చుటలో మరో పేచీ ఉంది. ఒకొక్కప్పుడు దానికి చిన్న "బుసి" ఉండి, పీల్చేవాడికి అంకిళ్లు పడిపోయినా సరే, పొగమాత్రం రాదు, చచ్చినా! దాంతోటి, ఆ పీల్చే వాడికి ఊహాకోపం జాస్తీ అయి చుట్టుపక్కవాళ్ళని చంపాలని ఉంటుంది. అల్లాకొంత ప్రయత్నించి, కొసకి, ఏకాగితమో చుట్టుబెట్టుగుని ఎల్లానో ఇదవుతాడు. సిగరెట్టులో ఈక్షోభ లేదు. చుట్టవల్ల పళ్ళన్నీ జీవితంలోనే పొగమూరడం కాక, పెదవి మీద వాతలు కుడాను. అదీగాక, చుట్టకాల్చడం అనేది ఒక పనిలా కనిపిస్తుంది, సిగరెట్టు కాల్చడం పనిగానిపని— అందుకనే సిగరెట్టు చదువుకున్నవాడి కోడి! చుట్టవెన

కెంతో, ఇప్పుడూ, ఎప్పుడూ అంతే! సిగరెట్టు స్వల్ప కాలంలోనే మారుతుంది, కొత్తమార్కుది దిగుతుంది. ఇంత తెలివితేటలతో ఉన్న సిగరెట్టు కాల్చడం వల్ల ఉండేలాభాలు తియ్యడానికి, ఉన్నాయేమో చూడ డానికి, ఓకమిటీవారు పనిచేస్తున్నారు, సులోచనాలు పెట్టుగుని. ఇది కాల్చడంవల్ల ఉండే ఖర్చు లెక్కవెయ్య డానికి మరోకమిటే ఉన్నారు. వీరి రిపోర్టులు తేలే యోగ్యత కనిపించదు.

హెచ్చుతగ్గులు ఎల్లా ఉన్నా సరే, నేను చుట్ట మానను. మానితే, భూమి—వాయు సమస్య పరిష్కారం కాదు. ఈ ముక్కలే నాకు శరణు...అన్నాడు ఒకడు.

"ఎముక మిగిల్చి మాంసము నెల్ల భక్షించు
క్షయరుగ్మతలకు వజ్రాయుధంబు
లోహమాండూరాల లొంగక సాధ్యమౌ
కఫవాతములసిత కార్ముకంబు
శూలాన పొడిచిన లీల శూల జనించు
అల యజీర్ణముల సిద్ధౌషధంబు
మబ్బుపట్టిన యంత బొబ్బలు పెట్టించు
నుబ్బసాదులను సూర్యోదయంబు
జనుల నగ్నిముఖుల నొనరించు నీ చుట్ట
కంపులెల్ల సాగ నంపుచుట్ట
దోమ బాధల తొలగ ద్రోయును పొగచుట్ట
చుట్ట మహిమలెన్న శూలి కగును"

మంచిచెడ్డలు ఎల్లాఉన్నా సరే. నేను బీడీమానను. మానితే, హిందూ—మహమ్మదీయ సమస్య పరిష్కారం కాదు. ఈముక్కలే నాకు శరణు—అన్నాడు ఇంకోడు.

దాడీ ముందుగ వచ్చెను
బీడీ తరువాత వచ్చె విధవిధములుగా
బీడీ పొగలకు పోడ్డా
ఏడీ కాదనెడి పురుషుడెల్లా హైనం.

సుళువు బలువులు ఎల్లా ఉన్నాసరే. నేను సిగ రెట్టు మానను. మానితే, ప్రాచ్య—పాశ్చాత్య సమస్యపరి ష్కారం కాదు. ఈముక్కలే నాకు శరణు—అన్నాడు మరోడు.

నాగరికత లేని ప్రజ
సిగరెట్ చవి చూడకుండ సిగరెట్ పొగరెట్
సిగసిగరెట్ పొగపొగరెట్
సిగరెట్ పొగరెట్టటంట చెల్లదు "స్యార్లీ".

ఇలాగ్గా, ధూమ విషయంలో హిందువులుయ థాశక్తి పనిచేస్తున్నారు కాని అంతా నడుంకడితేగాని కార్యం నెరవేరదు. అంతాచేతులు కలిపి పనిచెయ్యాలి ధూమం, కీర్తికిమల్లేనే తెలుపుకాబట్టి, ఏనాడుహిందూ దేశమంతా ఏకమై పొగపీల్చి వదులుతుందో, నాడే ఈ దేశపు శుభ్రకీర్తి దశదిశలా వ్యాపిస్తుంది. స్త్రీలుకొందరు ఇంగ్లీషునేర్చి, పురుషులతో సమానం అవడానికి చేస్తూన్న యత్నాలలో సిగరెట్టు సేవిస్తూ ఉండడం శుభసూచన. ఈధూమ స్వరూపాలని కనిపించి నప్పుడల్లా అంటిస్తే, లోకకల్యాణం, ఆట్టే దూరం ఉండదు.

౨. విశేషాలు.

ఓ చోట జరగబోయే రౌండుటేబిల్ కాన్ఫ రెన్సులో వెయ్యవలసిన టేబిల్ గురించి మాటా మాటా వచ్చింది. రౌండ్ టేబిల్ అనేది ఏదో ఊరికే గుండ్రం గా ఉండడమేకాక సంపూర్ణంగా ఉండాలని కొంద రన్నారు. మరికొందరు అట్లా వీలులేదనిన్నీ, భూమి గాని మరి యితర గ్రహముకాని, అవి నడిచేదారులు గాని, ఏవీసంపూర్ణధోరణిలో లేవనిన్నీ, అందుచేత అయినదానికీ కానిదానికీ సంపూర్ణం అంటూహూర్చ్కొక వట్టిపూర్ణం ముందు పుచ్చేసుగుని ఆపైని "సం" దెబ్బ లాట ఆడితే, కడుపు నిండుతుందనిన్నీ, కాబట్టి ప్రస్తు తం టేబిల్ యొక్క ఆకారం కోడిగ్రుడ్డులా ఉంటుం దనిన్నీ, వాదించారు. టేబిల్ యొక్క ఆకారం ఎల్లా ఉన్నా అది కొంతేనా ఇటూ అటూ జరగాలంటే, టేబిల్ యొక్క ప్రతీకోడుకీకింద చక్రప్రయోగం చెయ్యా కతప్పదని మరికొందరు తెలివిగలవారు అన్నారు.

శారదాబిల్లు శాసనం అయినా దాన్ని జనం శారదాబిల్లు అనే వాడుతూంటారు. ఈ పరిపాలనలో జనం ఆబాలగోపాలంగా ఉచ్చరించిన పేర్లల్లో ఇదోటి. కాని ఈ మాటయొక్క వాడకం, అర్థం, వ్యాఖ్యానం

ప్రాశస్త్యాన్ని బట్టి ఉంటోంది. కొందరు దాన్ని 'శార్ధపు' బిల్లు అన్నారు—అనగా దీనితో శార్ధాలు ఆఖరు అనో, లేక దీనితో శ్రోత్రియత్వానికి శార్ధం అనో. కొందరు ఇది 'సరదా' బిల్లు అన్నారు—అనగా దీంతో జనానికి ఎక్కడలేని షోకులూ బయల్దేరుతాయని గావును. శారద అంటే సరస్వతి గనక ఈ బిల్లువల్ల ఆడవాళ్లు మాటలు నేర్చి మరి ఎవ్వరి మాటా లెక్కచెయ్యరు అని కొందరు. శారద అంటే 'నూతనం' అని అర్ధం గనక ఈకొత్తబిల్లుని శారదాబిల్లు అన్నారని కొందరు. శారద అంటే అసమర్ధుడు అని ఉంది గనక అల్లాంటి వాళ్ల బిల్లుని శారదా బిల్లు అన్నారని కొందరు. శారద అంటే శరదృతువులో జనించింది అని అర్ధం. ఇది కూడా శరదృతువుయొక్క సామీప్యంలో పుష్పించింది కాబట్టి ఇది శారదాబిల్లు అన్నారని కొందరిమతం. శారద అంటే ఏడేసి పత్రాలు ఒకొక్క పర్వం దగ్గిర ఉన్న అరటిచెట్టు అనికూడా ఉందికదా, ఇందులోకూడా ఏడుస్తూ ఏడుసార్లు ప్రతీపర్వానికీ పత్రాలు అనే విడాకులుపుచ్చుగోడం ఉంటుందిగదా అని దీన్ని శారదాబిల్లు అనిఉంటారు అని కొందరి వాదన. శా అంటే దేవతాపూజ, ర అంటే శూన్యమై దా అంటే చూపులు ఎక్కువవుతాయి గనక ఇది శారదాబిల్లు అని ఒకరు. శా అంటే సామర్ధ్యం ర అంటే నశించి ద అంటే భేదాలు ఎక్కువవుతాయి గనక ఇది శారదా బిల్లు అని ఒకరు. శా అంటే శ్రేష్ఠుడు కూడా ర అంటే శిరస్సు వంచి దా అంటే భార్యని వేసుకోవాలిగనుక దీన్ని శారదా బిల్లు అన్నారని ఒకరు. శా అంటే తేజస్సుతో ర అంటే వజ్రంలాంటి దేహాలతో ద అంటే ఓర్పుతో జనం పుడతారు (ఇప్పటి కునిష్ఠిరకం కాకుండా)అంచేత ఇది శారదాబిల్లు అని ఒకరు. శా అంటే లక్ష్మిఉండాలి, ర అంటే మన్మధపరిపాలన ఉండాలి, దా అంటే వైరాగ్యం లాభ లేదు అనేటట్టు వస్తుంది గనుక దీన్ని శారదా బిల్లు అన్నారని ఒకరు. ఒక ముసిలావిడ ఈమధ్య మాట్లాడుతూ "అయితేనూ, ౧౪ ఏళ్లలోపల పిల్లలు పెద్దమనుషులు కాకూడదంటూ పైవాళ్లు రూలు సెట్టారట నిజమేట్రా, అబ్బాయి!" అని కొడుకుని అడిగింది. రేపు ఏప్రిల్ ఒకటో తారీఖులగాయతు ౧౪ ఏళ్లలోగా ఇండియాలో పెళ్లిళ్లు చెయ్యకూడదని దీని అర్ధం అని ఒకావిడ వాదించింది. "అయితే, ఈబిల్లురెండుమూడేళ్ల దాకా ఆచరణలోనికి రాదంటూరు నిజమే? అని కొందరు అడుగుతూంటారు—అల్లా అయితే బాగుండునని వాళ్లలోపల అభిప్రాయం. ఒకవేళ అల్లా జరిగితే, ప్రస్తుతం పెళ్లిచేసిన వాళ్లలోకొందరు పశ్చాత్తాప పడతారు.

౩. ప్రిన్సిపాలుకాదలచినవారికి ఉండవలసిన లక్షణాలు ఒక (కమిటీవారి అభిప్రాయం).

౧. ప్రిన్సిపాలు పొడుగేనా ఉండాలి, జబరదస్తీగానేనా ఉండాలి, వీల్లేకొస్తే రెండిందాలా ఉండాలి.

౨. ప్రిన్సిపాలు ఇంగ్లీషే చెప్పాలిగాని, తెలుగూ, హిందూస్తానీ, శాస్త్రంకాదు.

౩. ప్రిన్సిపాలు కడంవికాకపోతే పీడాపోయిరి. అధమం సిగరెట్టయినా నాగరికతతో పీల్చడానికి తగిన గుండెధైర్యం కలిగి ఉండాలి.

౪. ప్రిన్సిపాలు అధమం సాలుకి రెండు సందర్భాలలోనేనా పైవారితో ఓడిపోయే స్వభావం కలిగి ఉండాలి.

౫. ప్రిన్సిపాలు మాంచి తెలివీ, అపూర్వప్రజ్ఞా కలిగి ఉండాలి. పాఠంచెప్పనక్కర్లేదు. దాన్నిబట్టే ఇతరులు ఆయన తెలివి స్థిరపరచడం.

౬. ప్రిన్సిపాలు రూల్సు ఉన్నాయికదా అని వాటిని అక్షరాలా యముడులా ఆచరణలో పెట్టరాదు.

౭. ప్రిన్సిపాలు స్వజనాన్ని ప్రేమించాలి.

౮. ప్రిన్సిపాలు కొంత దాన ధర్మ బుద్ధి కలిగి ఉండాలి.

౯. ప్రిన్సిపాలు ఒకవేళ అఖండమైన తెలివిగలిగి ఉన్నా, కుర్రాళ్లని పరీక్షకి పెట్టించకుండా ఆపకూడదు.

౧౦. ప్రిన్సిపాలు తెలివీఉండి, పనీచేసేవాడైనా ఎవరో ఒకమహామహుడి మాటేనా వినాలి కాని,ఏదేనా

చెప్పు వెళ్లినప్పుడు తరుముకు నిరాకూడదు. ఉక్కని ఇస్కూకలపనూకూడదు.

౧౧. ప్రిన్సిపాలు తనకి రాకపోతే రానట్టు ఊరు కోవాలిగాని, ఏరోజుకి ఆరోజు పాఠం ఎవరిదగ్గిరో చెప్పించుగుని క్లాసులోకి తయారు కాకూడదు.

౧౨. ప్రిన్సిపాలు తన సబ్జెక్టు అయేది కాక పోయేది, ఒకటేమిటి నాకన్నీ సమానమే అని ప్రతీ దానిమీదా ఎక్కడ బడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు లెక్చరు ఇవ్వడానికి (ఇంగ్లీషున) తగినవాడు కావాలి. లేకపోతే, ఆయన తాలూకాబోర్డు ఎలిమెంటరీస్కూలు మేష్టరుకంటె తక్కువ అనుకుంటారు.

## ౪. వార్తలు

౧. ఆంధ్రవిద్యార్థుల సమావేశం యొక్క కార్యక్రమం యావత్తున్నూ ఇంగ్లీషు భాషలోనే జరిగి ఉండడంవల్ల, వారు తమభాషమానుకోడంలో ప్రకటించిన స్వార్థత్యాగానికి సానుభూతి కనపరుస్తూ అక్కడ హాజరుకాని, ఆంధ్రేతరులు ఒకతీర్మానమున్నూ, అరటిపండొలిచినట్టు భావబోధ అయి ఉండడంవల్ల ఆమోదం వెలిబుచ్చుతూ హాజరైన ఆంధ్రస్త్రీబాల వృద్ధులు ఒక తీర్మానమున్నూ యేదిక్కూలేని తమ ఇగ్లీషుని శ్రమపడి ఆంధ్రవిద్యార్థులు నిలబెట్టినందుకు తమ అమితకృతజ్ఞత గుమ్మరిస్తూ లండన్ కవులు ఒకతీర్మానరాజమున్నూ గావించి పంపినారని లోగడ ప్రచురింపబడిన సంగతి కల్లవార్త అని మావిలేఖరి పంపిన సవరణ నేడే మాకు చేరింది.

౨. జంతువులకూతలు, పిట్టలకూతలు, లోకంలోతక్కిన శబ్దాలున్నూ తానొక్కడే పుట్టించి సభనిరంజింప చెయ్యదల్చుకున్న ఒక ధ్వనికాడు టిక్కట్టుపెట్టగా, హాస్యానికి వేంచేసిన నూరురూపాయలజనులూ, అతడు రంగంమీదికి వచ్చేదాకా ఉండబట్టలేక, ఆయాయి జంతు పక్షుల ధ్వనిభేదాలు సునాయాసంగా చెయ్య మొదలు పెట్టగానే, హాస్యకాడు టిక్కట్టు సొమ్ము వాపసుచేసి, అట్టి అద్భుత చిత్రకళవారు అభ్యాసంలేకుండానే ఆర్జించినందుకు వారిలో ఒకరికైనా మెడలు ఇవ్వకమాననని పట్టుపట్టెను. ఆమెడలు ఒక విద్యార్థి పడసినందుకు ఆంధ్రులు ఎల్లానో తీరుబడి చేసుగుని కొంచెం గర్వపడాలి.

౩. ఒక గ్రామఫోను కంపెనీవాళ్లు గొప్పగాయకుల దగ్గిర్నించి ఉచితంగా రికార్డులు పుచ్చుగోడానికి రాగపిల్లిలో దిగగానే, ఆంధ్రగాన విద్యాదక్షులగు ప్రముఖులు చాలమంది, తమకు ఆహ్వానం రాకపోయినా, కంపెనీవారికి తమర్ని ఆహ్వానం చేసే సంకల్పం మనస్సులో ఉన్నట్టు దివ్యదృష్టిని కనిపెట్టి, వెళ్లగా, కంపెనీవారు స్వాగతపత్రం ఇవ్వనందున వీరు కోపంతో వెనక్కి నిష్క్రమించి సినీమాలో చేరాలని యత్నించుతున్నారని తెలిసినది.

౪. రైల్వే ప్రయాణీకుల సంఘాలు కలిసి ఎన్నుకున్న ఒకాయన ప్రయాణీకుల కష్టాలుగురించి రిపోర్టు తయారు చెయ్యడానికి రైల్లో తిరిగి తిరిగి కనిపెట్టిన సంగతి ఏమిటంటే! — రైల్వేకంపెనీవారికిన్నీ ప్రయాణీకులకున్నూ ఎంతో అన్యోన్యంగా ఉన్నందుకు మిక్కిలి సంతోషం అవుతోంది. జనుము కంపెనీ వారిమాట జవదాటడం లేదు. కంపెనీవారు రైలుపెట్టెల్లో "ఎంగిలి ఊయవద్దు" అని రాసిన ప్రకారంగానే జనం అంతా పెట్టెలోపలే, జాగ్రత్తగా, అవలికి చెదరకుండా, ఉమ్మి వేస్తున్నారు. మరిన్నీ కంపెనీవారు "దొంగలున్నారు, జాగ్రత్త" అని ఎల్లానూరాసేశారు గదా, ఊరుకుంటే వారు సమావేశమై చిన్నపుచ్చుగుంటారేమో అని ఎంతో అయిష్టంతో చాలామంది దొంగతనాలు యథాశక్తిగా చేస్తూనే ఉన్నారు. ఇది శాంతిసూచన—అనిరాశారు.

౫. నెలక్రితం మామిడిపురంలో అయి ఉన్న పెళ్లి సందర్భంలో, కన్యాప్రదాత పెళ్లికొడుకు కాళ్లు కడుగుతూన్న సమయంలో, కన్యాప్రదాతకి ముచ్చెమటలూపోసేటట్టు ఓ తేలు అంటుపొడిచింది. ఎంత వెతికినా తేలు దొరకలేదు. చివరకి పెళ్లికూతురు అన్నగారు తన బ్యాటరీ లైటు తెచ్చి "ఫోకసు" చేసిన మీదట, ఆతేలు ఇంకా తణుకూ బెణుకూ లేకుండా పెళ్లికుమారుడియొక్క మడమ నెరదల్లో మకాంచేసి ఉన్నట్టు తెలియవచ్చింది.

౬. లక్షుపిల్లి నగరంలో చాలామందిజేరి, భార్యాభర్తల విడాకులచట్టం ఉంటేనే చాలా బాగుంటుందని, ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ అభిప్రాయానికి ప్రతికూలంగా ఉన్నవాళ్లని వాళ్లు లోపలికి రానియ్యలేదు. దూసుకుపోయి వచ్చినవాళ్లని నోరెత్తనియ్యలేదు. ఈ తీర్మానం ప్యాసుచేసినవారిలో చాలమంది భార్యలూ కారు, ఆఖరికి భర్తలేనా కారు.

౭. ఎలెక్ట్రిక్ దీపాలు పెద్దగాలికి ఆరిపోయే స్వభావంకలిగి ఉండడంచేతనున్నూ,—(అంటే ఆగాలికి తీగలు తెగుతాయి, తెగితే దీపాలు నిద్దరోతాయి), అవి ఉంటే దెయ్యంలా ఉండడం, పోతే ఏప్యం అయిపోవడమేగాని సన్నంగా ముత్తెం అల్లాచేసి అట్టే పెట్టుగోడానికి వీలులేనివి అవడంచేతనున్నూ, చటుక్కున ఏసిగరెట్టేనా అంటించుగోడానికి గాని, ఏనెయ్యేనా వెచ్చబెట్టుగోడానికిగాని ఈషణ్మాత్రమూ ఉపచరించేవి కాకపోడంచేతనున్నూ, రాత్రెల్లు కూడా నిస్తేజంగా ఉండి ఏగ్యాసులైటేనా పట్టిగడితేగాని కంటికి ఆనకుండా చీకటిచేత ఆవరింపబడి ఉండే రకంవి అవడంచేతనున్నూ ఇంకానిదానంగా కొంతకాలం పరిశీలనచేసినమీదటగాని మేము అట్టే తొందరపడము అని చంద్రాపురజనులు చేసుకున్నతీర్మానం, వారి జ్ఞానతేజానికి నమోనా.

౮. ఆంధ్రపేపర్ మిల్సంటే చప్పరించిన వాళ్లల్లో కొందరు, ఇప్పుడు మిల్సుపొగవొదిలి, కూతట్టి, తిరిగేసరికి బయల్దేరిన కాగితంచూచి తమరూ తెల్లపోయి "ఇంతాచేసి కాగితమేనా, పోదూ!" అని మళ్లీ చప్పరించారు.

౯. కలవలపట్నం అనేనగరంలో పౌరులంతా పట్టుబట్టి తమ ఊరిస్కూలు హెడ్డుమాస్టరుగారి పని సరిగా లేకపోవడంచేత ఆయన్ని శిక్షింపదల్చుకుని, ఆయన్ని పూర్తిగాతీసెయ్యడానికి చేతులురాక, "ఆయనహెడ్" మాత్రం తీసేసి మేష్టరీమాత్రం అట్టేపెట్టారు. ఆయన హెడ్ ఒక దీర్ఘమైనవ్యాధి అనిన్నీ, అట్టివ్యాధి ఏకోశాన్నీ లేని మరియొకర్నివారు ఆస్థానే వేశారనిన్నీ వినబడింది.

౧౧. నగరవాసులూ, అక్షరాస్యులూ అయిన ఆంధ్రజనం యావద్విశిష్టం ఎరుగున్న పేళ్లనిగురించి కాఫీహోటల్లో ఒకరావుగారు మాట్లాడుతూ, "గయోపాఖ్యానం, వీరేశలింగం, భక్తచింతామణి, కాశీమజిలీలు అపనాతనామనా!" లాంటివి సెలవిచ్చాడు. ఈలిస్టులో "నమస్తే"గాని, "కోరి భజింతుణ్" గాని చేరే నూపన్లు ప్రతీనోటా గోచరిస్తూనే ఉన్నాయి.

౧౧. ఒక పట్టణంలోని కాఫీహోటళ్ల ఎదుటి వీథి భాగాలున్నూ, సోడాషాపుల ఎదుటి వీథి భాగాలున్నూ, నాటక వగైరాశాలల చుట్టుపట్ల వీథులున్నూ, కంకరలేని వీథిభాగాలున్నూ, కావలసిన వారి ఇళ్ల ఎదుటివీథి భాగాలున్నూ అహోరాత్రస్య తడిసియే ఉండడంవల్ల, వీథులు తడిపేయత్నంలో అంతమంది తమరికి తోడ్పడుతూన్నందుకు, ఆపట్టణమునిసిపాలిటీ వారు తమపౌరుల్ని అభినందించిరి.

౧౨. గోదావరీ తీరజనులు పుణ్యజనులనిన్నీ, ఋషులనిన్నీ ఎక్కడివాళ్లో అనుకుంటారు. పుణ్యజనులు అనడంలో ఆశ్చర్యంలేదు, ఈయుగంలో కాని ఇక్కడ ఋషులు ఉండడం మాత్రం నిజం. ఎంచేతంటే, మెయిన్ రోడ్డుమీద ఎక్కడచూసినా ముక్కుమూసుకుంటూరు, స్మరించుకుంటూ ఉంటారు.